



విశాఖ పోర్టు అత్యధిక సరుకు రవాణా రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ సరుకు రవాణాలో నూతన అధ్యాయాన్ని లిఖించింది. 1933లో నెలకొల్పిన పోర్టు ఈ ఏడాదికి 90 ఏళ్లను పూర్తి చేసుకుంటుంది, ఇప్పటి వరకూ సరుకు రవాణాలో పోర్టు గత రికార్డులను తిరగరాసి నూతన రికార్డును నెలకొల్పే దిశగా పరుగులు పెడుతోందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియకుండానే పోర్టు ఈ ఏడాది 73.78 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి గత ఏడాది చేసిన అత్యధిక సరుకు రికార్డును తిరగరాసిందని వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పోర్టు చేసిన 73.73 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణానే ఇప్పటి వరకూ పోర్టు చరిత్రలో అత్యధిక సరుకు రవాణా రికార్డులో ఉండేది. అయితే ఈ ఏడాది మార్చి 2 నాటికే పోర్టు ఆ రికార్డును తిరగరాసి 73.78 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసింది. విశాఖపట్నం పోర్టు ఛైర్పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు సమర్థవంతమైన నాయకత్వంలో డిప్యూటీ ఛైర్పర్సన్, విభాగాధిపతులు సమన్వయం కారణంగా పోర్టు ఈ ఘనతను సాధించిందని ఆయన పేర్కొన్నారు.

7న జెడ్పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 7న గురువారం ఉదయం 10 గంటలకు జెడ్పి ఛైర్పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం, విసి హాలులో జరుగుతాయని జెడ్పి సిఇఒ ఎం.పోలినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు 2, 5వ స్థాయీ సంఘాలతో సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 11 గంటలకు 4, 3వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని ఆయన వివరించారు. జిల్లా అధికారులు అందరూ తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

సంపత్ వినాయగర్ ఆలయ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో ప్రసిద్ధి చెందిన ఆశీల్ మెట్ట సంపత్ వినాయగర్ ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలూ చేపట్టనున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా శనివారం బాధ్యతలు చేపట్టిన దేవాదాయ ధర్మాదాయ శాఖ విశాఖపట్నం జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష మీడియాకు తెలిపారు. వంశపారంపర్య ధర్మకర్త చోళన్ నుంచి ఆమె ఈ బాధ్యతలు స్వీకరించారు. 2018 నవంబర్ 16న దేవస్థానానికి ఇఒ మినహాయింపు ఉత్తర్వులను ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఐదేళ్ల కాల పరిమితి గత ఏడాది నవంబర్ 14తో ముగియడంతో ఆలయ పాలనను దృష్టిలో పెట్టుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆలయానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంపత్ వినాయగర్ ఆలయానికి ఇఒ అవసరం ఉందంటూ భక్తులు కూడా పదేపదే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో దేవాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇఒగా అదనపు బాధ్యతలు చేపట్టిన సహాయ కమిషనర్ కె.శిరీష మాట్లాడుతూ సంపత్ వినాయర్ ఆలయాన్ని సందర్శించే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

నేడు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన కార్యక్రమం ఆదివారం ఉదయం 11:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతుందని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర జెఎసి అధ్యక్షులు కాంతారావు పాల్గొంటారని పేర్కొన్నారు.

సీట్లపై అస్పష్టత.. నేతల్లో ఉత్కంఠ

- టిడిపి, జనసేనలో బిజెపి భ్రమలు తొలగినట్లేనా ?
- సీట్ల సర్దుబాటు కొలిక్కి రావొచ్చంటున్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రేపో మాపో ఎన్నికల కోడ్ కూయనున్న సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు ముఖ్యంగా తెలుగుదేశం, జనసేన మధ్య విశాఖ జిల్లాలో పలు సెగ్మెంట్లకు సంబంధించిన సీట్ల కేటాయింపుల్లో అస్పష్టత కొనసాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను వెతుక్కోవాల్సిన స్థితి వీరికి నెలకొంది. మరోవైపు అధికార వైసిపి సీట్ల కేటాయింపులో మాత్రం కాస్త ముందంజలో ఉందనే చెప్పొచ్చు. నగరంలోని దక్షిణం సెగ్మెంట్లో సిట్టింగ్ అభ్యర్థి వాసుపల్లి గణేష్కుమార్నే వైసిపి అభ్యర్థిగా ప్రకటించడంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక్కడ టిడిపినా, జనసేననా అన్న సందిగ్ధత ఇరుపార్టీలకూ ఉత్కంఠ కలిగించేదిగా ఉంది. బిజెపితో పొత్తు కుదిరితేగాని నగరంలోని ఉత్తరం, దక్షిణం, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాల్లో ఎవరు పోటీ చేస్తారన్న విషయం తేల్చలేని స్థితి టిడిపి, జనసేనల్లో నెలకొంది. అయితే తాజాగా బిజెపి రాష్ట్ర నేతలు ఒంటరిగానే ఎన్నికల యుద్ధం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇంతకాలం ఎదురుచూసిన టిడిపి, జనసేనకు మింగుడు పడని అంశంగా ఈ నిర్ణయం ఉంది. బిజెపి అండ పైన ఉంటే కింద ఎన్నికల పని సజావుగా చేసుకోవచ్చన్న వ్యూహం తెలుగుదేశం, జనసేన పార్టీలది. కానీ టిడిపికి చెందిన దిగువ స్థాయి కార్యకర్తలు, నాయకులు మాత్రం ఇలాగైతేనే ప్రజల్లో ఓటడిగేందుకు వెళ్లగలమని, ఎపికి బిజెపి చేసిందేమీ లేదంటున్న ఆ పార్టీతో కలిస్తే ఓట్లు రాలవన్న అభిప్రాయంతో ఇప్పటికే ఉన్నారు.

టికెట్టు దక్కుతుందా?

దక్షిణంలో టిడిపి తరఫున గండి బాబ్జీ పోటీ చేసే సిద్ధంగా ఉన్నా అధిష్టానం ఆయన విషయంలో సీటు డిక్లేర్ చేయలేదని తెలుస్తోంది. మరోవైపు ఈ సెగ్మెంట్కు చెందిన సీతంరాజు సుధాకర్ దక్షిణంలో వాసుపల్లిని ఓడించేందుకు సిద్ధమయ్యారు. టిడిపి టికెట్ ఇస్తే పోటీచేయాలని చూస్తున్నారు. ఒకవేళ టికెట్ దక్కకపోయినా వాసుపల్లిని ఓడించి తీరాలన్న కసితో ఉన్నారు. ఇండిపెండెంట్గానైనా వేసి ఓడించాలనే ప్రణాళికతో ఆయన ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. తూర్పులో వైసిపి, టిడిపి నేతలు ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. ఉత్తరంలో టిడిపికి టికెట్ ఇవ్వనున్నట్లు జరుగలేదు. బిజెపి నాయకుడు విష్ణుకుమార్రాజు టికెట్ ఆశిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నేతలు రంగంలో ఉన్నారు. భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్లోనూ అధికార వైసిపి నేత మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సిట్టింగే కాబట్టి ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఇక్కడ సైతం టిడిపి అభ్యర్థిని నిర్ణయించలేకపోయింది. ఉత్తరం అసెంబ్లీ నుంచి 2019లో గెలిచిన గంటా శ్రీనివాసరావుకు టికెట్ ఇవ్వలేని పరిస్థితులు తెలుగుదేశంలో నెలకొన్నాయి. దీంతో గంటా ఇరకాటంలో పడ్డారు. బిజెపితో పొత్తు వ్యవహారం తేలకపోవడం ఒకవైపు, గంటా వంటి సీనియర్ను ఎక్కడ పెట్టాలో తేల్చుకోలేనంతలో టిడిపి ఇరకాటాన్ని ఎదుర్కొంటోంది. ఎంపీ అభ్యర్థి విషయంలోనూ ఇదే స్థితి టిడిపి ఎదుర్కొంటోంది. గీతం విద్యాసంస్థల ఛైర్మన్ మతుకుమిల్లి భరత్ ఈ టికెట్ను ఆశిస్తున్న సంగతి తెలిసిందే. వైసిపి అధిష్టానం తమ పార్టీ నుంచి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మికి క్లియరెన్స్ ఇచ్చింది. ఈ నెల 2 నుంచి ఆమె విశాఖలో ప్రచారాన్ని సైతం చేపట్టి ముందంజలో ఉన్నారు. బిజెపి నుంచి జివిఎల్ నరసింహారావు సైతం నాలుగేళ్లుగా తనకే ఎంపీ టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. టికెట్ల కేటాయింపులో అటు అసెంబ్లీ, ఇటు పార్లమెంట్ స్థానాల్లో టిడిపి, జనసేన కూటమి ముందడుగు వేయలేని స్థితి కొనసాగుతోంది.

సిఎం పర్యటనకు జోరుగా ఏర్పాట్లు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 5వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి రాడిసన్ బ్లూ హోటల్, వి-కన్వెన్షన్ హాళ్లను శనివారం ఆయన పరిశీలించారు. విజన్ వైజాగ్ పేరుతో రాడిసన్ బ్లూ హోటల్లో నిర్వహించే కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు హాజరుకానున్నారని, దానికి సంబంధించిన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



మహా పాదయాత్రపై ఎన్టిపిసి గేటు వద్ద ప్రచారం నిర్వహిస్తున్న కార్మికులు

నేడు 'ఉక్కు' పరిరక్షణకు మహా పాదయాత్ర

- సిపిఎం, సిఐటియు, కాంగ్రెస్, పలు ప్రజా సంఘాలు మద్దతు

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటం మరో దశకు చేరుకుంది. ఇప్పటివరకు శాంతియుత పోరాటాలతోనే కేంద్రానికి హెచ్చరికలు పంపించిన విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఉద్యమాన్ని ఉధృతం చేసింది. మంగళవారం మహా పాదయాత్రకు స్వీకారం చుట్టింది. 2021 జనవరి 27న పార్లమెంట్లో స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రతిపాదన వచ్చిన నాటి నుంచి పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో దీక్షా శిబిరం ఏర్పాటు చేసి రిలే నిరాహార దీక్షలు సాగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారు. నిరసనలు తెలియజేసి కార్మికులు సత్తా చాటారు. బయోమెట్రిక్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికుల మనోభావాలను దెబ్బతీయాలని చూసిన యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా 24 గంటల పాటు అధికారులను దిగ్బంధనం చేసి కార్మికవర్గం సత్తా ఏమిటో చూపించారు. గతంలోనూ మూడు రోజులు పాటు కూర్మన్నపాలెంలో జాతీయ రహదారిని అడ్డగించడంతో పోరాటం ఉగ్రరూపం దాల్చింది. గత నెల 27వ తేదీన ప్రధాని విశాఖ పర్యటన ఉంటుందని భావించి మహా పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. అయితే ప్రధాని పర్యటన వాయిదా పడటంతో మార్చి మూడో తేదీకి పాదయాత్రను వాయిదా వేశారు. కార్మిక శక్తిని తక్కువ అంచనా వేసిన ప్రతిసారీ పోరాట కమిటీ తరపున తమ సత్తా తెలియజేసే కార్యక్రమాలను రూపొందిస్తూ వచ్చారు. అయితే ఈసారి ఎన్నికల సమయం కావడంతో పోరాట కమిటీ మరింత పట్టుదలగా కార్యక్రమాలను రూపొందిస్తోంది. అందులో భాగంగానే ఈ మహా పాదయాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. వేలాది మందిగా తరలిరావాలని ప్రజలకు పోరాట కమిటీ పిలుపునిచ్చింది. 'కార్మికులను విచ్ఛిన్నం చేయాలని యాజమాన్యం చేస్తున్న కుట్రలను తిప్పి కొడుతూ ఈ పాదయాత్ర పెద్ద ఎత్తున నిర్వహించాలి. రాజకీయ పార్టీలు ఉక్కుపై చిత్తశుద్ధితో పనిచేయడంలేదు. అటు ఢిల్లీలోనూ, ఇటు రాష్ట్రంలోనూ సదస్సులు, ఉద్యమాలు నిర్వహించి స్టీల్ప్లాంట్ను కాపాడుకుంటూ వస్తున్నాం. మహా పాదయాత్రను అందరూ జయప్రదం చేయాలి. ఈ పాదయాత్ర ఆదివారం ఉదయం కూర్మన్నపాలెం కూడలిలో ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుంది. జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ కొనసాగుతుంది.' అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ శనివారం తెలిపారు.

సిపిఎం, సిఐటియు మద్దతు

విశాఖ కలెక్టరేట్ : మహా పాదయాత్రకు మద్దతు తెలుపుతున్నట్టు శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రకటించారు. సిఐటియు మద్దతు తెలుపుతున్నట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

మహా పాదయాత్రపై ప్రచారం

పరవాడ : మహా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఎన్టిపిసి మెయిన్ గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కరపత్ర ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు పి.గోవిందరాజు, పిపి.నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ నాయకులు శనివారం పార్లమెంటు సభ్యురాలు బివి సత్యవతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిపిఎస్ రద్దు చేయలేదని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలు రూ.20 వేల కోట్లు చెల్లించాలని, పిఆర్సి, ఐఆర్ ప్రకటించాలని, ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీనికి ఎంపీ సత్యవతి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంపీ చేతుల మీదుగా సిపిఎస్పై యుటిఎఫ్ ముద్రించిన బుక్ లెట్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వత్సవాయి శ్రీలక్ష్మి, రాజేష్, మారిశెట్టి వెంకట అప్పారావు, గొంది ఈశ్వర్, హేమకుమారి, బాబురావు, స్వామి, జాన్సి, బండారు శంకరరావు, జిఎస్ ప్రకాష్, ఆశ, సలీం, రెబాక రవి, సత్యనారయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి


ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు నానాటికి పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని అధిక ఉత్పత్తులు సాధించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు అన్నారు. విశాఖపట్నం ఆత్మ సౌజన్యంతో ఆర్ఎఆర్ఎస్లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న చెరకు ఒంటికన్ను ముచ్చల వినియోగం- సేంద్రియ సాగుపై ఎస్టిఆర్పై శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. శిక్షణ పొందిన 15 మంది రైతులకు ధ్రువపత్రాలను ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశా దేవి, ఏడిఆర్ డాక్టర్ జగన్నాథరావు, శిక్షణ సమన్వయకర్త డాక్టర్ కెవి రమణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం విశాలాక్షి, సీతారామలక్ష్మి, శిరీష, శ్రీదేవి, ఉమామహేశ్వరరావు, గౌరీ పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే నడుచుకుంటా

ప్రజాశక్తి- అనకాపల్లి : కార్యకర్తల అభీష్టం మేరకే నడుచుకుంటానని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానిక కార్యాలయంలో పీలా గోవిందను జనసేన నాయకులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ ఈ నెల 5న చంద్రబాబుతో సమావేశం అనంతరం టీడీపీ కార్యకర్తలతో సమావేశమై నిర్ణయం తీసుకుంటామన్నారు. బీజేపీతో పొత్తుల తరువాత సీట్ల కేటాయింపులో మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సహకరించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరపున అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న నేపథ్యంలో తనకు సహకరించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ శనివారం చర్చలను సందర్శించి పాస్టర్లను అభ్యర్థించారు. మామిడిపాలెం, సిరసపల్లి గ్రామాల్లోని చర్చలను ఆయన సందర్శించారు. క్రీస్తు సంఘ సభ్యులు స్వాగతం పలికి సత్కరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిరసపల్లి కేబుల్ రాము ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమంలో పాల్గొని వివిధ సంఘ నాయకులను వారి నివాసాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చర్చి పాస్టర్లను కలుస్తున్న వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త భరత్ కుమార్

ఎంఎస్ఎంఇ పార్కుతో యువతకు ఉపాధి

ప్రజాశక్తి -అనకాపల్లి

జిల్లాలోని కోడూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్కుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పటాన్ శెట్టి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎంఎస్ఎంఈ పార్కును, నూతనంగా నిర్మించిన కలెక్టర్ బంగాళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో తమ ప్రభుత్వం పరిశ్రమల ద్వారా సుమారు 50 వేల మందికి ఉపాధి కల్పించమన్నారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత 59.47 ఎకరాలలో 40 కోట్ల 57 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో జెడ్పి ఉపాధ్యక్షులు బీవీ సత్యవతి, జిల్లా ఇండస్ట్రియల్ అధికారి శ్రీధర్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు పెద్దిశెట్టి గోవింద, మల్ల బుల్లిబాబు, కోడూరు సర్పంచ్ సేనాపతి లక్ష్మి శ్రీనివాస్, కొల్లిమల్ల గోవింద, మంత్రి సత్తిబాబు, పసుపులేటి రామకృష్ణ, ఎంపిటీసీ కోరుకొండ అచ్చియమ్మ పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి అమర్నాథ్, కలెక్టర్ రవి పట్టన్శెట్టి తదితరులు

రోడ్డు పునర్నిర్మాణం ప్రజా పోరాట విజయం

పోరాట కమిటీ కన్వీనర్ రామ శదాశివరావు

ప్రజాశక్తి -మునగపాక

ప్రజలు, ప్రజా సంఘాల పోరాటంతోనే అనకాపల్లి నుండి అచ్యుతాపురం వరకు రోడ్డు పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఇది ప్రజా పోరాట విజయమని రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో అచ్యుతాపురం మునగపాక మండలాలకు చెందిన అఖిలపక్ష పోరాట కమిటీ నాయకుల సమావేశం శనివారం జరిగింది. రోడ్డు పునర్నిర్మాణానికి జరిపిన పోరాటంలో పాల్గొన్న ప్రజలకు, పార్టీలకు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. పోరాట ఫలితంగా ఫిబ్రవరి 29న స్థానిక శాసనసభ్యులు రమణ మూర్తి రాజు చొరవ తీసుకొని పనులు ప్రారంభించినందుకు ఆయనకు కృతజ్ఞతులు తెలిపారు. పోరాట కమిటీ కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు మాట్లాడుతూ అత్యంత అధ్వాన్నంగా ఉన్న రోడ్డును విస్తరణ పేరుతో ఏళ్ల తరబడి పునర్నిర్మాణం చేయకపోవడంతో ప్రజలంతా నరకం చూశారన్నారు. దీనిపై రౌండ్ టేబుల్ సమావేశం, ఫిబ్రవరి 12న బైపాస్ నుండి అచ్యుతాపురం వరకు భారీ మానవహారాన్ని నిర్వహించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందని చెప్పారు. సమావేశంలో వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఆళ్ళ మహేశ్వరరావు, వివి.శ్రీనివాసరావు, జనసేన నాయకులు టెక్కలి పరశురాం, టిడిపి నాయకులు మద్దాల కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్రావు, టెక్కలి జగ్గ అప్పారావు, ఆళ్ల సూరిబాబు, సరగడం శివ బాపునాయుడు, ఎల్లపు గోవింద, ఆడారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల శ్రీగౌరీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి రూరల్ మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఉచిత టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నారాయణమూర్తి, జోగప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల జెడ్పి హైస్కూల్లో మధ్యాహ్నం 2 నుండి 4.30 గంటల వరకు జరిగే ఈ టాలెంట్ టెస్ట్లో 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉంటాయని పేర్కొన్నారు. అత్యధిక మార్కుల పొందిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ప్రథమ బహుమతి రూ.5000 షీల్డు, ద్వితీయ బహుమతి రూ.3000 షీల్డు, తృతీయ రూ.2000, ప్రతి పాఠశాల నుంచి ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి వెయ్యి రూపాయల ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి మధ్యాహ్నం ఒంటి గంటలకు హాజరుకావాలని కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నర్సింగబిల్లిలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణరావు, టిడిపి నేత గొంతుని శ్రీనివాసరావు, సర్పంచ్లు కొన అరుణ నాగేశ్వరరావు, కొట్టే రాము, ఎంపీటీసీ షేక్ దర్గా స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేసులు పరిష్కారానికి మానిటరింగ్ సెల్ చొరవ చూపాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : జాతీయ లోక్ అదాలత్లో కేసులు పరిష్కరించేందుకు మానిటరింగ్ సెల్ చొరవ చూపాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం కోర్టు కానిస్టేబుల్స్, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాజీ చేసుకోదగిన కేసుల్లో ఉభయ పక్షాల వారిని లోక్ అదాలత్ ప్రవేశపెట్టడం వలన ప్రజలకు సమయం, డబ్బు వధా కాకుండా చేయగలిగిన వారమవుతామని చెప్పారు. సమావేశంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ లక్ష్మణమూర్తి, సిఎంఎస్ ఎస్సై రామారావు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -చోడవరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్ను శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరీ శంకర్ స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓవిఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

వసతి గృహం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- చోడవరం : మండలంలో గన్నవరం గ్రామంలో రూ.35 కోట్లతో నిర్మించనున్న మహాత్మ జ్యోతిరావు పూలే సాంఘిక వసతి సంక్షేమ గృహానికి స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు 900 మంది విద్యార్థులు చదువుకునే విధంగా పది ఎకరాల విస్తీర్ణం గల స్థలంలో నిర్మాణం చేపడుతున్నామన్నారు. మండలంలో శారదా నది అవతలకు ఉన్న గ్రామాలు ఈ స్కూలు నిర్మాణంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ సన్యాసిరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని కొత్తపల్లి బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన ఎన్ఆర్ టైలర్ తంగేటి సింహాచలం మృతి చెందగా, ఆయన కుటుంబానికి టైలర్స్ అసోసియేషన్లు చేయూత అందించాయి. న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పత్తికొండ వెంకటేశ్వరరెడ్డి ఆర్థిక సాయం పంపించగా, దానిని సింహాచలం కుటుంబ సభ్యులకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంది మహేష్ శనివారం అందజేశారు. కశింకోట మండలం టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లెల నూకునాయుడు తమ సంఘం తరుపున రెండు బియ్యం బస్తారు అందించారు. కార్యక్రమంలో కె.నాగేష్, గురుమూర్తి, శ్రీమంతుల సూర్య నారాయణ, పెండ్యాల నాగేశ్వరరావు, మొల్లేటి సూరిబాబు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కర్రి అప్పలనాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కె.కోటపాడు మండల ఎన్నికల అధికారి బొడ్డేడ రాంబాబు అన్నారు. మండలంలోని చౌడవాడ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వివి ప్లాట్లుపై ప్రజలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో బిఎల్వోలు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట పంచాయతీ పరిధి కస్పావీధి గ్రామ సంఘంలో పోలింగ్ స్టేషన్లో స్వయం సహాయక సంఘాలు సభ్యులు, హెల్త్ సిబ్బందితో ఓటరుపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల డిటి సురేష్, ఏపిఎంఎస్ శ్రీనివాసరావు, సీసీ సత్యనారాయణ, విఓఏ వరలక్ష్మి, పాల్గొన్నారు.

సిద్ధం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మేము సిద్ధం -మా బూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని బగడ్బందీగా అమలు చేయాలని బూత్ స్థాయి కార్యకర్తలకు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో 40 రోజుల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రతి వైసిపి కార్యకర్త తమ బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాను పరిశీలించి ఇంకా ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే బిఎల్ఓలకు తెలపాలని సూచించారు. ఎంపీపీ కాసులమ్మ, జడ్పీటీసీ మారిశెట్టి శ్రీకాంత్ విజయ, వైసిపి నాయకులు ఏడువకు సత్యారావు, పల్లా నర్సింగరావు, డివిఆర్ పాల్గొన్నారు.

సరోజినీ నాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి- కశింకోట : భారత కోకిల, స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి సరోజినీ నాయుడు వర్ధంతి కార్యక్రమంలో కశింకోట మండలం సోమవరం గ్రామంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆ గ్రామ మాజీ సర్పంచ్ గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సరోజినీ నాయుడు చిత్రపటానికి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఉగ్గిని రమణమూర్తి, నైనంసెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, కోన రమణ, కోన మాణిక్యం, తాడేలు సూరిబాబు, నానాజీ, బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ : గత కొద్ది రోజులుగా నిర్వహించిన ఎంసిబి సీజన్-5 క్రికెట్ పోటీలు శనివారంతో ముగిసాయి. మధురవాడ పరిధిలో 24జట్లు పోటీ పడగా ఎస్ఎన్‌డి చంద్రంపాలెం జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ తృతీయ స్థానాలలో బొట్టవానిపాలెం, వాంబే కింగ్స్ క్రికెట్ జట్లు ట్రోఫీలను అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాగోతి సత్యనారాయణ, కోర్రాయి సురేష్, కార్తీక్, జగ్గుపిల్ల నరేష్, శ్రీకాంత్‌రెడ్డి, పిళ్ల రమణ, పిళ్ల శ్రీను, జగ్గుపల్లి నాని, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆహార అలవాట్లుపై జూ పార్కులో అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల, సదరన్ విద్యా సంస్థ సంయుక్తాధ్వర్యాన ఆహార అలవాట్లుపై జూ పార్కులో శనివారం అవగాహన కల్పించారు. అటవీశాఖ సిసిఎఫ్ శ్రీకంతనాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సదరన్ గ్రూప్ కళాశాల ఫుడ్ న్యూట్రిషియన్ విద్యార్థులు, అధ్యాపకులు జూ పార్కుకు వచ్చిన సందర్శకులను పరీక్షించి ఎత్తు, బరువు ఆధారంగా కొలెస్ట్రాల్ స్థాయి ఎంత ఉండాలి, వయస్సుకు తగ్గట్టు ఎంత బరువు ఉండాలి, ఆహారపు అలవాట్లును ఆరోగ్యంగా ఏ విధంగా మార్చుకోవాలి, బిఎంఐ అంటే ఏమిటి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిసిఎఫ్ శ్రీకంతనాథరెడ్డి మాట్లాడుతూ జూ పార్కులో సందర్శకుల కోసం ఇటువంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో సదరన్ గ్రూప్ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరన్ గ్రూప్ సిఎమ్‌డి సతీష్, డిసిఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్స్ గోపి, గోపాలనాయుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేశ్వరరావు, సదరన్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు ఓటర్లకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బార్ అసోసియేషన్ సహకారంతో ఓంకారేశ్వర ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యాన 'ఓటు హక్కు వినియోగం'పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు. రాజ్యాంగ విలువలు కాపాడగలిగిన వారిని ఎన్నుకోవాలని సూచించారు. నిజాయతీ గల వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకుంటే పేద ప్రజలకు మేలు జరుగుతుందని నొక్కి చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల, ఓంకారేశ్వర ఆధ్యాత్మిక సేవా సంఘం అధ్యక్షులు పల్లా భరత్ కుమార్, ఆయుర్వేద వైద్యులు సత్తరవు వాయునందనరావు, సామాజిక కార్యకర్త కంటుభుక్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూ లైఫ్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు


ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం యాన్యువల్ క్రియేటివ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ శ్యామ్ మాథ్యూస్, ప్రిన్సిపల్ జయశ్యామ్ ఆధ్వర్యాన విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆలోచింపజేశాయి. న్యూ లైఫ్ పాఠశాల ప్రారంభం, దినదిన అభివృద్ధిని వివరిస్తూ పదో తరగతి బృందం ఏర్పాటుచేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. 9వ తరగతి విద్యార్థులు ప్రాచీన సాంస్కృతిక కళలు, జానపద ప్రదర్శన నమూనాలు, 8వ తరగతి విద్యార్థులు మెజీషియన్ ప్రదర్శన, 7వ తరగతి విద్యార్థులు చారిత్రక కట్టడాల నమూనాలను, 6వ తరగతి విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై పలు నమూనాలను ప్రదర్శించారు. ఎల్‌కెజి నుంచి ఐదో తరగతి విద్యార్థుల వరకు అందరూ వివిధ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్యామ్ మాథ్యూస్ మట్లాడుతూ, నాణ్యమైన, ఉన్నతమైన విద్యను అందించడమే న్యూ లైఫ్ పాఠశాల ముఖ్య ఉద్దేశమన్నారు. లాభాపేక్షే కాకుండా గ్రామీణ ప్రాంతంలో ఆంగ్ల విద్యను సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందించడమే ధ్యేయంగా పాఠశాలను ఏర్పాటుచేసి 18 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ రెజీ వర్గీస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు

నేడు బుల్లయ్య కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ఏర్పాట్లు పూర్తి : మధుకుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మధుకుమార్ తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల గోల్డెన్స్ జూబ్లీ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తెలిపారు. కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల 1973లో కేవలం రెండు తరగతి గదులు, 120 మంది విద్యార్థులతో ప్రారంభమై నేడు 6500 మంది విద్యార్థులతో నడుస్తోందని చెప్పారు. ఐదు దశాబ్దాల విద్యా చరిత్ర, 10 ఎకరాల సువిశాలమైన ప్రాంగణం, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, 450 మంది సిబ్బంది, 6500 మందికి పైగా విద్యార్థులు ఉండటం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా కళాశాల సాధించిన విజయాలను, భవిష్యత్తు కార్యాచరణ గురించి, సిబ్బంది, సంస్థ ఐదు దశాబ్దాలుగా విద్యార్థులకు అందించిన ఉత్తమ విద్యా బోధనా గురించి గుర్తుచేశారు. ప్రస్తుత ఉపాధి అవకాశాల దృష్ట్యా ఆధునిక నైపుణ్యంతో పారిశ్రామిక నైపుణ్య శిక్షణను అందించే ప్రయత్నంలో భాగంగా కళాశాల కొన్ని కంపెనీలతో భాగస్వామ్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ పరిణామంలో భాగంగానే ఇటీవల టివిఎస్ ట్రైనింగ్ సర్వీసెస్‌ను ఎలక్ట్రికల్ వాహనాల కోసం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఇందులో ఇతర ఇంజినీరింగ్ విద్యార్థులు సైతం పాల్గొనే అవకాశం కల్పించినట్లు చెప్పారు. 45 విద్యా కోర్సులతో పాటు కళాశాలలో వివిధ క్రీడలను, ఎన్‌సిసి, ఎస్‌ఎన్ఎస్ కార్యక్రమాలను ప్రోత్సహించటం ద్వారా విద్యార్థులకు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తున్నట్లు తెలిపారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థులు రంజీ ట్రోఫీ, జాతీయ క్రీడలలో పాల్గొన్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద ఎన్‌సిసి బృందాన్ని కళాశాల కలిగి ఉందన్నారు.

బుల్లయ్య కళాశాల ఆంధ్రాయునివర్సిటీకి అనుబంధంగా, నాక్ 'ఎ' గ్రేడ్ అక్రిడేషన్ కలిగి స్వయం ప్రతిపత్తి కళాశాల హోదాలో ఉందని వివరించారు. ఆదివారం నిర్వహించే బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవంలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు కె.జయభారత్‌రెడ్డి, ముఖ్య అతిథిగా డాక్టర్ బివిఆర్.మోహన్‌రెడ్డి, గౌరవ అతిథులుగా ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ డివిఎస్ఎస్.సోమయాజులు పాల్గొంటారని తెలిపారు. ఈ స్వర్ణోత్సవ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు ప్రొఫెసర్ కెసి.రెడ్డి అధ్యక్షత వహిస్తారని మధుకుమార్ తెలిపారు.

ఆర్‌టిసి బస్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన



బస్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక శివాలయం ఎదురుగా సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ సహకారంతో రూ.2 కోట్లతో నిర్మించనున్న ఆర్‌టిసి బస్ స్టేషన్ పనులకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ బస్‌స్టేషన్ ఏర్పాటు అనేది స్థానిక ప్రజల చిరకాల కోరిక అన్నారు. ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో బస్‌స్టేషన్ ఏర్పాటు ఎంతో అవసరమని గుర్తించిన ప్రభుత్వం, దివీస్ సహకారంతో ఇందుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఆర్‌టిసి జోనల్ చైర్మన్ జి.బంగారమ్మ మాట్లాడుతూ, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, దివీస్ సంస్థ ప్రతినిధులు, జివిఎంసి 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేష్, జగుపిల్ల ప్రసాద్, జివి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ బిల్డర్స్ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -పిఎం పాలెం : మాతృశ్రీ, పివిఆర్ బ్రదర్స్ ఆధ్వర్యాన మాతృశ్రీ శ్రీరామ, కీర్తిశేషులు పోతిన అప్పారావు, సన్యాసమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ చలివేంద్రాన్ని మధురవాడ బక్కన్నపాలెం 80 అడుగుల రోడ్డులో మాతృశ్రీ బిల్డర్స్ నూతన వెంచర్ ఆవరణలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతృశ్రీ సంస్థల అధినేత పోతిన శివ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా మాతృశ్రీ బిల్డర్స్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీరామబుద్ధ వెల్ఫర్ అసోషియేషన్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. సామాజిక సేవతో సంతృప్తి కలుగుతుందన్నారు. వేసవి దాహార్తి తీర్చేందుకు మూడు నెలలపాటు మజ్జిగ, మంచినీరు, శీతలపానీయాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరపు శ్రీనివాస్, సంతోష్, పిళ్ల రేవతిరావు, పోతిన మురళి, కాగితాల ధీరజ్, దుక్క అప్పలరాజు, మాతృశ్రీ బిల్డర్స్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభంలో పోతిన శివ తదితరులు

మేధావులు మౌనం వీడాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : మేధావులు మౌనం వీడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1115వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సిఎంఇ, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ సభ్యులు డి.ఆదినారాయణ, కారు రమణ, రామకృష్ణ, దాసరి శ్రీనివాస్, సిహెచ్ సన్యాసిరావు మాట్లాడుతూ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని గత ప్రధాన మంత్రులు ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణాల ద్వారా ఆయా వర్గాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత బిజెపికి ప్రధాని నరేంద్ర మోడీ 9 ఏళ్ల పాలనలో 75 ఏళ్ల స్వతంత్ర ఫలాలను తన అనుయాయులైన అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి పేద వర్గాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా ఉన్న మేధావులు మౌనం వీడాలని కోరారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన వేళ అన్ని వర్గాలు ఆందోళనకు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గుమ్మడి నరేంద్ర, ఇ.శ్రీనివాసరావు, వరసాల బాలకృష్ణ, గంగవరం గోపి, జిఆర్‌కె.రాజు, వెంకటరావు, మధు, నానాజీ, నర్సింగరావు, ఎ.రాజు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : ఎపి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ఆధ్వర్యాన చిట్టివలస బంతాట మైదానంలో గుర్తింపు శిబిరం నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు సహకారతో కేంద్ర ప్రభుత్వ సంస్థ అలింకోచే వికలాంగులు, వినికిడి లోపం ఉన్న 60 ఏళ్ళు పైబడిన మహిళలు, పురుషుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నిపుణులు వివిధ పరీక్షలు చేశారు. అర్హులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వికలాంగుల సంక్షేమ శాఖాధికారి మాధవి, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

మురళీకృష్ణకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సొసైటీ సంస్థ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలోని థర్మల్ ఇంజినీరింగ్, ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ అంశంపై నూతన ఆవిష్కరణలు, పరిశోధనలో అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పుస్తక ప్రచురణలు చేసినందుకు ఈ అవార్డు లభించింది. ఎఐఎంఇఆర్ సొసైటీ ఆధ్వర్యాన హైదరాబాద్ సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఇటీవల అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణను శనివారం కళాశాలలో అధ్యాపకులు సిబ్బంది అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి రాంజీ ఎస్టేట్ కమ్యూనిటీ హాల్లో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సుగుణకుమార్ ఆధ్వర్యాన 47, 48 వార్డుల పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, నాయకులు సుకుమార్, విజయ్, రమేష్, సురేష్, కనకరాజు, సాయి, ముక్క రమణ, రాఘవులు, జయ కుమార్, జగ్జీవన్‌రావు, సుధాకర్, నరసింగ్, పవన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14, 24, 25 వార్డులకు సంబంధించిన వాలంటీర్లకు శనివారం సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 14, 24, 25 వార్డుల కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, నాయకులు కర్రి మురళీకృష్ణారెడ్డి, ఎపిడి దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ ఏర్పాటుకు సేకరించిన భూములకు సంబంధించి చట్ట ప్రకారం పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు ఎటువంటి పనులు చేపట్టొద్దని నిర్వాసితులు, నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని బుచ్చిరాజు పేట కొత్తూరులో శనివారం నిర్వాసితులు సమావేశం నిర్వహించారు. ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు, ఉపాధి కోల్పోతున్న కూలీలు, దళితులు, మత్స్యకారులు, వివిధ వృత్తిదారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ళ శ్రీనివాసరావు, అమలాపురం వైస్ సర్పంచ్ గంటా నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు ఆర్.గోవిందరావు, పి.బాబ్జీ, ఎం.బాబ్జీ, ప్రసాద్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు, నిర్వాసితులు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట: మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, వైసీపీ నాయకుడు అద్దిపల్లి రామారావుకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన లక్ష రూపాయల చెక్కును శనివారం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పటల్ లో ఆయన వైద్య చికిత్స పొందారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరుకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.



చెక్కును ఇస్తున్న ధర్మశ్రీ

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి -నక్కపల్లి:పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఎంఈఓ నరేష్ కోరారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. గణితం, సైన్స్ తదితర సబ్జెక్ట్‌లపై పలు ప్రశ్నలను వేసి సమాధానాలను రాబట్టారు. సబ్జెక్టుల వారీగా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయని విద్యార్థులంతా కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు.వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, స కె.జి.బీ.వీ ప్రిన్సిపాల్ షేక్ సలీమా, వైస్ ప్రిన్సిపాల్ వి.నాగలక్ష్మి ఉన్నారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

టిడ్కో గృహాల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ 16వ వార్డుకు చెందిన 33 మంది లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి ఆధ్వర్యంలో శనివారం టిడ్కో గహాలను అప్పగించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వైసీపీ హయాంలోనే పేదల సొంతింటి కళ సాకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, యూత్ అధ్యక్షుడు దనిమిరెడ్డి ప్రసాద్, పలువురు నాయకులు కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు తాళాలు ఇస్తున్న కౌన్సిలర్

డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-మాకవరపాలెం:భార్యపై అనుమానంతో భార్య, పిల్లలపై పెట్రోల్ తో పోసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై డిఎస్పీ మోహన్ విచారణ చేపట్టారు. మండలంలోని రాచపల్లిలో తుంగళ రమణ నిద్రిస్తున్న సమయంలో భార్య విజయపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో భార్య విజయ, చిన్న కుమార్తె శ్రీకావ్యలు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం డీఎస్పీ విచారణ జరిపారు. ఆయన వెంట నర్సీపట్నం రూరల్ సిఐ హరి, ఎస్సై రామకృష్ణారావు పాల్గొన్నారు.




విచారిస్తున్న డిఎస్‌పి

డిప్యూటీ తహశీల్దార్‌గా సోమశేఖర్

ప్రజాశక్తి-రోలుగుంట: మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పెద్దింటి సోమశేఖర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కోటవురట్ల మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తూ రోలుగుట కార్యాలయానికి బదిలీ పై వచ్చారు. రోలుగుంటలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేసిన త్రివేణిని గత ఏడాది జులైలో బదిలీ చేశారు. అప్పటి నుండి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఉప తహశీల్దార్ సోమశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల ఉప తహసిల్దార్ సోమశేఖర్ ఇటీవల ఎన్నికల బదిలీల్లో భాగంగా రోలుగుంట బదిలీ అయిన సందర్భంగా శనివారం కార్యాలయంలో సిబ్బంది ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటరమణ మాటాడుతూ, విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు ప్రజలు, సిబ్బందిలో ఎప్పుడు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు.సోమశేఖర్ బదిలీ పట్ల పలువురు గ్రామరెవెన్యూ అధికారులు బావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న సిబ్బంది

టిడ్కో గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర డిమాండ్ చేశారు. శనివారం జనసేన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్ల కాలంలో టిడ్కో గృహాలను పట్టించుకోలేదన్నారు. ఈ గృహాలకు వైసిపి రంగులు వేశారనీ, ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా ఇళ్లను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నారు. సదుపాయాలు లేకుండా లబ్ధిదారులు ఆ ఇళ్లల్లో ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, దొరబాబు, కొండలరావు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న శీరం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్నను వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. జనవరి నెలలో ఆయన బైక్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడి, విశాఖ లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల కోలుకున్నారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, తనకు ప్రమాదం జరిగిన వెంటనే సహకారం అందించి, మెరుగైన వైద్య సౌకర్యం కల్పించి, అండగా నిలిచిన రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మంత్రి అమర్నాథ్, కంబాల జోగులు, చిక్కాల రామారావులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ శ్రేణులు సిద్దాబత్తుల నూకతాత, సత్తిబాబు, రవి, తాతబాబు, గోవింద్, బాబురావు, చంద్రరావు, శేషారత్నం తరలివచ్చారు.



వెంకన్న సన్నిధిలో శీరం

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో హద్దర్శక్ కంపెనీ, డిబిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కంపెనీ డిబిఎస్ ఫౌండేషన్ మండల జూనియర్ కోఆర్డినేటర్ కే.మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి 18 రకాల చేతి వృత్తుల వారు అర్హులన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ పథకానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ సరోజినీ పాల్గొన్నారు



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్

'అమరవీరుల త్యాగాలు మరువలేం'

ప్రజాశక్తి -చీడికాడ:మాదిగల అమరవీరుల త్యాగాలను మరువలేమని అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్తా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జైతవరం గ్రామంలో శుక్రవారం రాత్రి మహాజన సోషలిస్ట్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాదిగల అమరవీరుల కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి త్యాగాలను, ఆశయాలను మరువలేమని ప్రతీ కార్యకర్త అందుకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మారడపూడి నాగరాజు, కంటిపాము సంతోష్, కంటిపా మంగయ్య, గుమ్మాలు, ఏలుచూరి పైడ్రాజు, అర్చన, కలిగొట్ల ప్రదీప్, బోర్రా పెంటయ్య, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

మహాగర్జన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -రావికమతం:అమరావతిలో జరిగే వికలాంగుల మహా గర్జన సభకు రావికమతం మండల దివ్యాంగులందరూ తరలి రావాలని మండలం దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గంజి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, దివ్యాంగుల మహా గర్జనకు సంబంధించి ఈనెల 3న రావికమతం మండల కేంద్రం జడ్పీ హైస్కూల్లో ఉదయం 9 గంటలకు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లివి.హెచ్.పి.హెచ్. జిల్లా అధ్యక్షులు గంద్రెడ్డి రాము హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. చోడవరం నియోజవర్గంలో ఉన్న నాలుగు మండలాల దివ్యాంగులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు.

4న తలనీలాల వేలం పాట

ప్రజాశక్తి -వడ్డాది: బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తలనీలాల వేలం పాటకు టెండర్లని ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 4న సోమవారం ఉదయం 11 గంటలకు దేవాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈనెల 20 నుండి 24వ తేదీ వరకు కళ్యాణ ఉత్సవాలల్లో కొబ్బరి చెక్కల వేలంపాటదారులు రూ.5000, తల నీలాలకు రూ.5000 ధరవత్తు చెల్లించి పాట పాడుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు దేవాలయం వద్ద సంప్రదించవచ్చని తెలిపారు.



బౌద్ధ విజ్ఞానం-లౌకిక జీవనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బౌద్ధ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు అవసరం

ప్రజాశక్తి-సీతమ్మధార : బుద్ధుని జీవితం, బోధనలతో పెనువేసుకున్న ఈ ప్రాంతంలో బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాల్సిన అవసరం ఉందని మాజీ వీసీ, యుపిఎస్‌సి పూర్వ సభ్యులు ఆచార్య కెఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, పంచశీల ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యాన ప్రొఫెసర్ కెఎస్.చలం రచించిన 'బౌద్ధ విజ్ఞానం - లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ సభ శనివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య కెఎస్.చలం మాట్లాడుతూ, బౌద్ధంపై పరిశోధనల కోసం బుద్ధ విజ్ఞాన కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనేక పుస్తకాలు, పరిశోధన గ్రంథాలు పరిశీలించి ఈ పుస్తకాన్ని వెలువరించినట్లు తెలిపారు. బౌద్ధం జీవన విధానంగా, ఒక సామాజిక ఉద్యమంగా రూపొందాలని, దేశంలో సాంస్కృతిక చైతన్యం రావాలని ఆకాంక్షించారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన రాజధమ్మ (మయనాన్మార్) మాట్లాడుతూ, నాది అనే స్వార్థాన్ని వీడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధం విస్తరించిందని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ వి.వెంకటరావు మాట్లాడుతూ, రచయితలు, మేధావుల ఆలోచనలు ఈ సమాజంపై ప్రభావం చూపిస్తాయన్నారు. మాజీ వీసీ ముత్యాలనాయుడు మాట్లాడుతూ, అనేక లోతైన పరిశోధనలు చేసి ఈ గ్రంథాన్ని మలిచారన్నారు. ఈ పుస్తకాన్ని ఆకాశవాణి వ్యాఖ్యాత కూర్మాన శ్రీదేవి విశ్లేషించారు. ప్రముఖ రచయిత, ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ, దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో సహనాన్ని నేర్పాయని తెలిపారు. వై.విజయకుమార్, జెవి.సత్యనారాయణమూర్తి, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, బుద్ధిజమ్ ఎడిటోరియల్ సభ్యులు, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్.హనుమంతరావు, పి.శ్యామసుందర్, డాక్టర్ పి.శ్రీనివాస్, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

స్మారక బహుమతికి నిధులు బహూకరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం నృత్య విభాగంలో స్మారక బహుమతిని ఏర్పాటు చేశారు. విభాగ ఆచార్యులు కె.సరస్వతి విద్యార్థి 'కూచిపూడి పితామహ శ్రీ సిద్ధేంద్రయోగి మెమోరియల్ ప్రైజ్' ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైజ్ ఏర్పాటు చేయడానికి అవసరమైన రూ 1.5 లక్షల నిధులను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డిని కలిసి అందించారు. విభాగంలో ఎంఏ డాన్స్‌లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఈ ప్రైజ్ అందించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే అభ్యంతరాలపై గ్రామసభ

ప్రజాశక్తి -ఆనందపురం : ఇనాం భూములకు సంబంధించి ఇదివరకు రీ సర్వే జరిగిన బోని, సిర్లపాలెంలో శనివారం తహశీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. ఈ ఇనాం భూములకు సంబంధించి భూమిపై గల కౌలుదారుల పేర్లపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలని కోరారు. గ్రామ సభకు సంబంధించి సర్వే వివరాలతో కూడిన జాబితాను సచివాలయ పరిధిలో ఉంచామని, అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, వీఆర్ఓ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏక్యూజే కళాశాలలో రక్తదానం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం గుడిలోవ ఏక్యూజే కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన రోటరీ బ్లడ్ బ్యాంక్, విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్తంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం ప్రాముఖ్యత, ఆవశ్యకతను కళాశాల కరస్పాండెంట్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పి.హెచ్.ఫారూఖ్, డైరెక్టర్ పి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ పిఓ పవన్‌కుమార్, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార, ఆనందపురం : జివిఎంసి 45వ వార్డు వాసుదేవనగర్ కాలనీ 256 సచివాలయంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసిన పట్టాలను లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ కంప హనోక్ శనివారం అందించారు. ఈ సందర్భంగా హనోక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ, నాయకులు హరి పట్నాయక్, రాజుయాదవ్, నేపాల్ శ్రీను, బాబూరావు, మాత ఈశ్వర్, మహేష్, గోవింద్, ప్రభాకరరావు, పోతల శ్రీను, వార్డు సిఐ రమణి పాల్గొన్నారు.

జివిఎంసి 25వ వార్డు కార్పొరేటర్ కార్యాలయంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు వేణు, సంతోషి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండల పరిధిలో ఆనందపురం, చందక, సొంట్యాం పంచాయతీలలో జగనన్న ఇళ్లు పొంది రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పట్టాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ హేమంత్‌కుమార్, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి నాయకులు వైసిపి బంక సత్యం, వెంకట్రావు, పాండ్రంకి శ్రీను, మణిశంకర్ నాయుడు, సర్పంచ్ చందకలక్ష్మి, బంక శ్రీను, రాంబాబు, షినగం చిన్న రామారావు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

రంపచోడవరం : పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీని స్థానిక ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణం వద్ద ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఐటీడీఏ కార్యాలయం నుండి దేవీపట్నం సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి రోజు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ల వద్ద, మరో రెండు రోజులపాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరాలలో పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శిరీష, రాధిక, వినోద్ కుమార్, పవన్, ఎంపిహెచ్ఓ పీటర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మలేరియా వర్కర్లు పాల్గొన్నారు.

చింతూరు : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ముద్రించిన పోస్టర్, బ్యానర్‌ను ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య శనివారం చింతూరు ఐటీడీఏ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతూరు డివిజన్లో ఉన్న 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 0-5 సంవత్సరాల లోపు 10,809 మంది పిల్లలు ఉన్నారని, వారి కొరకు 379 పల్స్ పోలియో బూతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన బూతులతోపాటుగా 40 మంది సూపర్వైజర్లను రూట్ ఆఫీసర్స్‌గా నియమించి పిల్లలందరికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ పుల్లయ్య, తులసిపాక పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఉదయకుమార్ రెడ్డి, ఐటీడీఏ ఏపీవో కె.సుజాత, ఏవో రాజకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని డి ఎం అండ్ హెచ్ఓ జమాల్ భాష సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మూడు రోజుల కూడలి వరకు సిబ్బందితో కలిసి పోలియో పై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి, సిబ్బంది మహేష్, సదయానందం పాల్గొన్నారు.

పరవాడ : పల్స్ పోలియో వ్యాధిపై శనివారం పరవాడలో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ పిహెచ్‌సి వైద్యులు జయశ్రీ కరిష్మా మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డనుండి ఐదు సంవత్సరాల బిడ్డ వరకు పోలియో వ్యాధి రాకుండా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆదివారం అన్ని గ్రామల్లో పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎంఎస్ఎస్ సాయిరాం, జానకిరామన్, ఎమ్మెస్ సతీష్ కుమార్, పివి రత్నం, కె.రత్నం, ఎం.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : 0 - 5 సంత్సరాలు లోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేయించాలని తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యు రమేష్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు.



విశాఖలో ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుజాత

నక్కపల్లి: మండలంలో ఈనెల 3న ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యులు సుకన్య, కిరణ్ ప్రసాద్ కోరారు. పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ర్యాలీ చేపట్టారు. మండలంలోని 6153 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: ఈ నెల 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ హరిప్రవీణ్, డాక్టర్ గాయత్రిలు కోరారు. శనివారం పిహెచ్‌సి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు ఖచ్చితంగా ఈ పోలియో చుక్కలు వేయించాలన్నారు. నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో కీలకమన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
పల్స్‌పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. పిహెచ్‌సి పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

సీతమ్మధార : డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ బి.సుజాత ప్రారంభించారు. ఈ ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా మళ్లీ డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీలో డిఎం అండ్ హెచ్ఓ పి.జగదీశ్వరరావు, డాక్టర్ ఎస్.జీవనరాణి, బి.నాగేశ్వరరావు, కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 3530 మందికి పోలియో చుక్కలు వేయనున్నట్టు మాకవరపాలెం, బూరుగుపాలెం పిహెచ్‌సి వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ తెలిపారు. పల్స్ పోలియోపై శనివారం ఆటోపై ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

నేరాలు ఘోరాలు

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం తురకలపూడి గ్రామంలో శనివారం పోలీసులు దాడి చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఆయన వద్ద వద్ద ఉన్న 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కి పంపినట్లు ఎస్సై డి.ఈశ్వరరావు తెలిపారు.

నాటు సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెం గ్రామ శివారు ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్న బట్టీపై పోలీసులు శనివారం దాడి చేశారు. అక్కడ దొరికిన 20 లీటర్ల నాటు సారా, 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు తెలిపారు.

110 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- రావికమతం: రంపపు పొట్టు ముసుగులో గుట్టుగా గంజాయిని తరలిస్తున్న ముఠాను రావికమతం పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. కొత్తకోట సిఐ ఎల్. అప్పలనాయుడు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రావికమతంలో స్వీటు షాపు నడుపుతున్న గెంజి జి సత్తిబాబు రంపపు పొట్టుతో కలిపి గంజాయిని రావికమతం తీసుకొచ్చి స్వీట్ షాపులో భద్రపరిచాడన్నారు.. ఎస్సై ధనంజయ స్వీట్లు కొనుగోలు చేసే వినియోగదారుల్లా వెళ్లి అతడి ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. ఎస్సై ధనంజయ లోపలకు ప్రవేశించే సమయంలో రంపపు పొట్టు నుంచి వేరు చేసిన గంజాయిని రెండు కిలోల చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. వీరిని అదుపులోకి తీసుకొని సెల్ ఫోన్, ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపామని కొత్తకోట సిఐ అప్పలనాయుడు తెలిపారు.

విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ట్రాఫిక్ ఇబ్బందులు కారణంగా ఆలస్యం, పరీక్షల సమయానికి ఆయా కేంద్రాలకు చేరుకోవడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా సిబ్బందిని పెంచి, ఎప్పటికపుడు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల ఎస్‌పిలు, కలెక్టర్లకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు సభ్యులు గొండు సీతారాం తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆదరాబాదరాగా పరీక్ష కేంద్రాలకు అతి కష్టం మీద చేరుకుంటున్న వైనాలు కమిషన్ దృష్టికొచ్చినట్లు ఆయన శనివారం పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులుంటే apscpcr2018@gmail.com కు ఫిర్యాదులందిస్తే సత్వరం ఆయా జిల్లా ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీతారాం తెలిపారు.

పేద విద్యార్థులకు అంతర్జాతీయ విద్య

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రతిష్టాత్మకమైన ఎడెక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం రాష్ట్ర యువతకు నూతన వరంగా నిలుస్తుందని, పేద విద్యార్థులకు అంతర్జాతీయ విద్య అందుతుందని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి చెప్పారు. శనివారం తన కార్యాలయంలో ఏయూ విద్య విభాగం ఆధ్వర్యాన ఎడెక్స్ కోర్సుల పట్ల హర్షం వ్యక్తంచేస్తూ విద్యార్థులు థాంక్యూ సిఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఏపీ యువత పోటీ పడాలని, తదనుగుణంగా వారి విద్య ప్రమాణాలు, సామర్థ్యాలు పెంపొందింపచేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అందరికీ సమాన అవకాశాలు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ నూతన అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా యువత ఎదగాలన్నారు.

విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రతిభే కొలమానంగా కలిగిన విద్యార్థులకు అంతర్జాతీయ విద్యసంస్థలైన ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల నుంచి నేరుగా కోర్సులు చదివి సర్టిఫికేషన్ పొందే అవకాశం నేడు లభించిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెన్ బజ్ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వివి.లక్ష్మీనారాయణ

ఉత్సాహంగా పెన్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యా రంగంలో 40 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న పెన్ స్కూల్ వార్షికోత్సవాన్ని 'పెన్ బజ్' పేరుతో శనివారం సాయంత్రం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిబిఐ మాజీ జాయింట్ డైరక్టర్ వివి.లక్ష్మీనారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను దేశానికి ఆస్తులుగా తయారు చేయాలని కోరారు. తల్లిదండ్రులు ప్రోద్భలంతోనే మహాత్మా గాంధీ, అంబేద్కర్, చత్రపతి శివాజీ వంటి వారు దేశానికి ఆస్తులుగా మారి భారతదేశ చరిత్రలో కీర్తిప్రతిష్టలు పొందారని గుర్తుచేశారు. పెన్ స్కూల్ ద్వారా 4500 మంది విద్యార్థులను దేశానికి ఆస్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. పెన్ స్కూల్ కరస్పాండంట్ అనిత పెరీరా మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువే కాకుండా ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, కళలను వెలికితీసి ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో నగరంలోని డాబాగార్డెన్స్, అక్కయ్యపాలెం, మాధవధార బ్రాంచిలలో గల సుమారు వెయ్యి మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సందడిగా గురుస్థానం ప్లే స్కూల్ వార్షికోత్సవం



అతిథులతో చిన్నారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిల్లలకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని, అటువంటి వాటికి పాఠశాల వార్షికోత్సవం చక్కని వేదిక అని దిశా పోలీసు స్టేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు సిహెచ్. వివేకానంద తెలిపారు. గురుస్థానం ది ప్లే స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలు మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం సందడిగా జరిగాయి. ముఖ్య అతిథులుగా వివేకానంద, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫరూఖీ, 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ పాఠశాల ప్రారంభించి ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లల చదువులో తల్లుల పాత్ర కీలకమని, చదువు పట్ల తల్లిదండ్రులు ఇంటి వద్ద శ్రద్ధ తీసుకుంటే పిల్లలు ఉత్తమ విద్యార్థులుగా తయారవుతారని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.నిషా ప్రిన్సిపాల్ గౌసియా భేగం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

భవన నిర్మాణ కార్మికురాలికి సరుకుల వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రామ్‌నగర్‌లోని భవన నిర్మాణ కార్మికురాలు పార్వతి ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకోగా 28వ వార్డు భవన నిర్మాణ కార్మిక సంఘం చేయూతనివ్వాలని సంకల్పించింది. నెల రోజులకు సరిపోయినంత నిత్యావసర సరుకులను సమకూర్చింది. వాటిని ఆమెకు భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షులు కె.నర్సింగరావు శనివారం ఈ సందర్భంగా అందజేశారు. కార్మికుల్లో ఇటువంటి ఐక్యత రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుర్గారావు, ఎన్.రామారావు, చిన్నా పాల్గొన్నారు.

ప్రజలతో పరాచకాలు..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

శ్రీశ్రీ అన్నట్లు 'పద పోదాం - మెలికలు తిరిగే దారులు దిగి, పగతీర్చుకుందాం - ఎన్నో అన్యాయాల మీద'. ప్రగతి నిరోధకుల, ప్రజా కంటకుల, విశ్వాస ఘాతుక పాలకులపై కసి తీర్చుకొనేందుకు మంచి అవకాశం ప్రజల ముందుకొస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్న బిజెపి, దానికి వంతపాడుతున్న వైసిపి, టిడిపి, జనసేనను మరికొద్ది రోజుల్లో రానున్న ఎన్నికల్లో ఓడించి పగతీర్చుకోవాలి. స్టీల్‌ప్లాంట్ భూములను అమ్మకానికి పెట్టినా.. సిగ్గు విడిచి బిజెపి చుట్టూ తిరుగుతున్న ఆ మూడు పార్టీలకు మంగళ హారతివ్వాలి. ఇంతవరకు ఆడిన నాటకాలు చాలక.. కొత్తకొత్త డైలాగులతో, హావభావాలు ప్రదర్శిస్తూ ప్రజలను వంచించడానికి వెన్నుపూసలేని పార్టీలు దారులు వెతుకుతున్నాయి. మెలికలు తిరిగే దారులు దిగి ప్రజలంతా ఆ పార్టీలకు బుద్ధిచెప్పాలి. 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, బిజెపిని, దానికి మద్దతిస్తున్న పార్టీలను ఓడిద్దాం' అనే అంశంపై విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఇటీవల భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో యోగేంద్ర యాదవ్ అన్నట్లు రాబోయే ఎన్నికలను సాధారణ ఎన్నికలుగా చూడకూడదు. ప్రజాస్వామిక హక్కులు, విలువలు, రాజ్యాంగంపై దాడులు పెరుగుతున్న కాలంలో జరుగనున్న ఎన్నికల్లో పాలక ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పడానికి పౌరసమాజం కదలిరావాల్సిన, కలిసి రావాల్సిన సమయమిది.



విభజన హామీలను అమలుచేయని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు పాదాక్రాంత మయ్యాయి. అవేవీ ప్రజలకు తెలియదన్నట్లు ఈ మధ్య రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధరేశ్వరి విశాఖ రైల్వేజోన్‌కు కేంద్రం అన్ని చర్యలూ తీసుకున్నా, రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వడంలేదని వైసిపి ప్రభుత్వంపై నింద వేశారు. బిజెపి, వైసిపి మధ్య రాజకీయ ఒప్పందం రాష్ట్ర ప్రయోజనాలను ఎలా దెబ్బతీస్తూ వచ్చిందో ఈ ఐదేళ్లలో ప్రజలు చవిచూశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరించబూనుకున్నా, తాజాగా ప్లాంట్ భూములను అమ్మకానికి పెట్టినా నోరువిప్పడానికి ధైర్యం చాలని పిరికి పెద్ద పార్టీలతో ఈ రాష్ట్రానికి పట్టిన పీడ వదిలించుకోవాలి.

నవశకం వెబ్‌సైట్‌లో వాల్మీకుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-పెదబయలు: నవశకం వెబ్ సైట్లోని గిరిజన తెగల జాబితాలో ఉన్న వాల్మీకి ఉపకులాన్ని తొలగించడం అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ తెలిపారు. రాజకీయ స్వలాభం కోసమే వాల్మీకి ఉప తెగను వెబ్ సైట్ నుండి మళ్లీ తొలగించారనీ విమర్శించారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 33 తెగల గిరిజన జాబితాలో వాల్మీకి తెగ ఆప్షన్ కనబడలేదని, ఇదేమి అన్యాయం ప్రశ్నించారు. అసలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక తెగను చేర్చడం లేదా తొలగించడం చేసే హక్కు లేదని అది పార్లమెంట్ లేదా రాష్ట్రపతికి మాత్రమే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు టీ.కౌసల్య, మండల అధ్యక్షులు బొండా గంగాధరం పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: నవశకం వెబ్ సైట్లోని గిరిజన తెగల జాబితాలో ఉన్న వాల్మీకి ఉపకులాన్ని తొలగించడం సరికాదని మాజీ ఎంపీటీసీ సాయిబాబా దురియ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయ స్వలాభం కోసమే వెబ్సైట్ నుంచి ప్రభుత్వం మళ్లీ తొలగించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని తెలిపారు.

6వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో గిరిజనేతరురాలు బుడ్డిగ కొండమ్మ వెలుగు కార్యాలయ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్నీ వెంటనే తొలగించాలని ఆదివాసీలు చేపడుతున్న రిలే దీక్షలు శనివారంతో 6వ రోజుకు చేరుకున్నాయి. వెలుగు సిబ్బంది పాల్గొని తమ వంతు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వెలుగు కార్యాలయంలో అక్రమ నిర్మాణాన్నీ తొలగించాలని సిబ్బంది నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీ వెలుగు కార్యాలయం స్థలాన్ని బుడ్డిగ కొండమ్మ స్థానిక రెవెన్యూ అధికారుల అండతో దర్జాగా ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకున్నా అధికారులు కనీసం స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పి.పోతురాజు నాయుడు, జి.దిలీప్, పి వేణుగోపాల్, ఎస్.కొండబాబు, ప్రసాద్, ఆనంద్, రాజు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల తరలింపునకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ. వి.అభిషేక్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకు అసెంబ్లీ నియోజక వర్గానికి కేటాయించిన స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాలులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాల వారీగా ఈవిఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ కౌంటర్లు, ఫుడ్ కౌంటర్లు ఏర్పాటుపై సమీక్షించారు.

హెల్త్ సెక్రటరీ సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల సాంకేతిక లోపాల కారణంగా సస్పెన్షన్‌కు గురైన ఏటికొప్పాక సచివాలయ హెల్త్ వర్కర్ జ్యోతి సస్పెన్షన్‌ను శనివారం ఎత్తివేశారు. గ్రామ, వార్డు సచివాలయ రాష్ట్రంలోని 10 జిల్లాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సచివాలయ హెల్త్ సెక్రటరీలను డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీం విజిట్స్ సందర్భంలో గర్భిణీ స్త్రీలకు హెచ్ఐ రీడింగ్ నమోదులో తేడాలు ఉన్నాయని సస్పెండ్ చేశారు. దీనిపై ఏపీ స్టేట్ సచివాలయ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీనివాస్‌ని కలిసి సాంకేతిక లోపాలతో జరిగిన తప్పిదాలపై సస్పెన్షన్ సరైనది కాదని విజ్ఞప్తి చేయడంతో సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ మేరకు ఏపీ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దేవకి, రత్నం హర్షం వ్యక్తం చేశారు.

కుట్టు మిషన్ శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి-చోడవరం : ఏపీఎస్ఎస్‌డిసి స్కిల్ హబ్ ద్వారా కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సర్టిఫికెట్లను కళాశాల ప్రిన్సిపల్ టి.రాధాకృష్ణ అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్, స్కిల్ హబ్ ఇన్చార్జి వి.అప్పలనాయుడు, శ్రీనివాసరావు, డాక్టర్ రత్నభారతి, బిచ్చుమ్మ డి మాల్యాద్రి, జి నారాయణమూర్తి, ఎస్ఎం రఫుద్దీన్, సుధీర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సర్ఫాసి అసెట్స్ ఫెయిర్‌లో పాల్గొన్న బ్యాంకు అధికారులు

సర్ఫాసి అసెట్స్ ఫెయిర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ బ్యాంక్ విశాఖపట్నం జోనల్ కార్యాలయం వారు ద్వారకా నగర్ నాలుగో లైన్‌లోని సీతంపేట బ్రాంచిలో సర్ఫాసి అసెట్స్ ఫెయిర్ - 2024 ఆస్తుల విక్రయ ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు. బ్యాంకు విశాఖపట్నం జోనల్ మేనేజర్ ఏకే పూర్బె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖపట్నం జోన్ పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన సర్ఫాసి ఖాతాల 21 ఆస్తుల ఫొటోలను, వాటి వివరాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ఆస్తులు అన్నింటికీ మార్చిలో వేలం ప్రక్రియ నిర్వహిస్తామని రికవరీ టీం చీఫ్ మేనేజర్ అన్నపూర్ణ తెలియజేశారు. ఈ ప్రదర్శనకు అధిక సంఖ్యలో ఔత్సాహికులు హాజరయ్యారని తెలిపారు. ఇతర వివరాల కోసం దగ్గరలోని ఇండియన్ బ్యాంక్ శాఖలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ అభివృద్ధికి కృషి చేస్తా : బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం అభివృద్ధికి తాను కృషి చేస్తానని వైసిపి విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ తెలిపారు. గతంలో రెండు పర్యాయాలు విజయనగరం పార్లమెంట్ సభ్యురాలిగా, విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన ఆమెను వైసిపి విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా అధిష్టానం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం నుంచీ ఆమె విశాఖలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొలుత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం తన పుట్టినిల్లు అయితే, విజయనగరం మెట్టినిల్లు అన్నారు. తాను విశాఖలోనే చదువుకున్నానన్నారు. గతంలో ఎంపీగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న అనేక సమస్యలపై పని చేశానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు 27 పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టిలకు అమల్లో ఉన్న 27 పథకాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని పునరుద్ధరించి తిరిగి అమలు చేయాలని భారత్ సమాజ్ డెవలప్‌మెంట్ పార్టీ జాతీయ అధ్యక్షులు చింతాడ సూర్యం కోరారు. పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు ఎంతో మేలు చేస్తున్నామని వైసిపి ప్రభుత్వం గొప్పలు చెప్పడం సరికాదన్నారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడంలోనూ, విభజన హామీలను నెరవేర్చడంలోనూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు.

వాసుపల్లికి సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివిధ తుపానుల తాకిడికి మునిగిపోయిన 36 మంది బోట్లకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా కృషి చేశారంటూ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు మత్స్యకార బోటు ఓనర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆశీలుమెట్టలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం మత్స్యకారులతో కలిసి వారు వాసుపల్లిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పిసి.అప్పారావు మాట్లాడారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత వహించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యత వహించాల్సి ఉంటుందని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. డైట్‌లో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా అలోచించి ముందడుగు వేయాలని కోరారు.